దంచికొడుతున్న ఎండలు

- జిల్లాలో 21 ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు
- టీజీడీపీఎస్‌లో జిల్లా స్థాయి సగటు ఉష్ణోగ్రత లెక్కింపు
- ఆరెంజ్ జోన్‌లో రాజన్న సిరిసిల్ల
- గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.8 డిగ్రీలుగా నమోదు
- పగటివేళల్లో బయట కనిపించని జనాలు
- ఎండలకు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎండలు దంచి కొడుతున్నాయి.. సూర్యుడి ప్రతాపానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైనే నమోదవుతూ ఆరెంజ్ జోన్‌లో సిరిసిల్ల నిలుస్తోంది. జిల్లాలో మండలాల్లో ప్రాంతాల వారీగా ఎండ తీవ్రత వేర్వేరుగా ఉంటోంది. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ల ద్వారా వాతావరణ శాఖ లెక్కలు వేస్తూ హెచ్చరికలు జారీ చేస్తోంది. జిల్లాలో శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 43.8 డిగ్రీలు నమోదైంది. అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. జిల్లాలో ఉదయం 9 దాటిందంటేనే ఎండవేడికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో బయటకు రావడానికి జనం జంకుతున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాల్లో జన సంచారం లేక ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతాలు వెలవెల బోతున్నాయి. శనివారం మధ్యాహ్నం జిల్లాలో రుద్రంగిలో 43.8, చందుర్తిలో 43.7, కోనరావుపేటలో 43.7, ఎల్లారెడ్డిపేటలో 43.7, గంభీరావుపేటలో 43.7, వేములవాడరూరల్‌లో 43.6, బోయినపల్లిలో 43.6, వీర్నపల్లిలో 43.3, ఇల్లంతకుంటలో 41.8, ముస్తాబాద్‌లో 41.6, సిరిసిల్లలో 41.5, వేములవాడలో 41.1, తంగళ్లపల్లిలో 40.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లో ఉష్ణోగ్రతను పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

● ఎండ మండలానికో తీరు..

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ గరిష్ఠ ఉష్ణోగ్రత 43.8 దాటింది. మండలాలు, ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో తేడాలు ఉంటాయి. ఎండను ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా అధికార యంత్రాంగం లెక్కిస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 21వెదర్ స్టేషన్లు ఉన్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల పట్టణం, పెద్దూర్, కోనరావుపేటలో మర్తనపేట, చందుర్తిలో మల్రిగడ్డ, వేములవాడ రూరల్‌లో వట్టెంల, మల్లారం, వీర్నపల్లి మండంలో వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలంలో నేరేళ్ల, ఇల్లంతకుంట మండలంలో కందికట్కూర్, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్, ముస్తాబాద్ మండలం అవునూర్, నామాపూర్, వేములవాడ మండలంలో నాంపల్లి, కోనరావుపేట మండలంలో నిజామాబాద్, రుద్రంగి మండలంలో రుద్రంగి, మానాల, గంభీరావుపేట మండలంలో గజసింగవరం, గంభీరావుపేట, బోయినపల్లి మండలంలో బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలో ఎల్లారెడ్డిపేటల్లో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో తెలంగాణ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) నిర్వహణలో జిల్లాల వారీగా సగటు ఉష్ణోగ్రతలు లెక్కిస్తుంది. ఉష్ణోగ్రతల్లో 45 డిగ్రీలు వస్తే హెచ్చరికగా, 40-45 డిగ్రీలు వస్తే అప్రమత్తం, 35-40 జాగ్రత్త, 35ఉంటే హెచ్చరికలేనిదానిగా గుర్తిస్తారు. ఉష్ణోగ్రత లెక్కలను బట్టి ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడం, దానికి అనుగుణంగా చర్యలు చేపడుతారు. ఆరెంజ్ అలర్ట్‌లో పేర్కొన్న జిల్లాలో పలు సూచనలు చేస్తుంటారు.

● నిర్మానుష్యంగా ప్రాంతాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జిల్లా కేంద్రంలో ఎప్పుడూ రద్దీగా ఉంటే పాతబస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, కూరగాయల మార్కెట్, కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, వెంకంపేట ప్రాంతాలు మధ్యాహ్నం వేళల్లో నిర్మానుష్యంగా మారుతున్నాయి. శనివారం జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మిగతా 4వ పేజీలో

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. రైతులు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా రైతుల ధాన్యం సేకరించడంలో జాప్యం జరుగుతోందని అన్నారు. తూకం వేసిన ధాన్యం లారీల కొరత వల్ల కేంద్రాల్లోనే నిల్వ ఉందని పేర్కొన్నారు. సన్నాలను కొనుగోలు చేసినా తరలించడంలో శ్రద్ధచూపకపోవడం వల్ల రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు 24 గంటల్లో రైతుల ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్న సర్కారు 20 రోజులు గడుస్తున్నా నేటికి జమ కాలేవని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేసి రైతుల ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు అండగా నిలబడి ఆందోళనలను చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, లక్ష్మారెడ్డి, గణేశ్, యాదగిరి, బుగ్గారెడ్డి, శ్రీనివాస్, సాయిలు, ప్రదీప్‌రెడ్డి, రవి, శ్రీశైలం, రంజిత్, రామచంద్రారెడ్డి, రాజ్‌కుమార్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఇల్లంతకుంటలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా బీసీ జనాభాను లెక్కించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అని బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు స్వతంత్ర భారతదేశంలో ఇంతటి గొప్ప నిర్ణయం ఇప్పటి వరకు ఎవరు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సర్వేకు ఎలాంటి ప్రాతిపదిక లేదన్నారు. తాము చేసిన సర్వేను కేంద్రప్రభుత్వం అనుసరించిందని చెప్పుకోవడం దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలక ఉపయోగపడే నిర్ణయం ఎప్పుడు తీసుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బత్తిని సాయగౌడ్, నాయకులు నాగసముద్రాల సంతోష్, మ్యాకల మల్లేశం, మామిడి హరీష్, బత్తిని స్వామి, చింతలపెల్లి శ్రీనివాస్, కోల సంతోష్, గోపాల్, రాజు, శ్రీశైలం, సుధీర్‌రెడ్డి, వేణు, అఖిల్, సతీష్, అనీల్, చంద్రశేఖర్, బాబు, చిమ్మనగొట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలి

రుద్రంగి, మే 3 (ఆంధ్రజ్యోతి): కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు వెళ్లే ఎల్లంపల్లి కాలువకు భూమి కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం వెంటనే అందించాలని ధర్మాసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం హరీష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరమ్మ ప్రాజెక్ట్ కాలువ పనుల్లో భాగంగా ముంపునకు గురవుతున్న భూమికి నష్టపరిహారం అడగడమే రైతు చేసిన నేరం అన్నట్టుగా అధికారులు రైతుపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడం చాలా అన్యాయమని అన్నారు. కాలువ నిర్మాణ పనుల్లో ఇండ్ల స్థలాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్నారని గత 8 సంవత్సరాలుగా నష్టపరిహారం కోసం బాధితులు గత బీఆరెస్ ప్రభుత్వానికి, అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా లాభం లేకుండా పోయిందని అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దయ్యాల పెద్దులు, దయ్యాల ఉదయ్, పొందేటి రమేష్, పోడేటి రాజేందర్, నిర్వాసితులు దయ్యాల సందిల నర్సయ్య, సైఫ్‌ఉద్దీన్, దయ్యాల సుమన్, దయ్యాల పోచయ్య, దయ్యాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను విస్మరించిన ప్రభుత్వం

సిరిసిల్ల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని పోసి రెండు నెలలు గడుస్తున్న ఇంతవరకు జిల్లా అధికారులతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని, వారంలోగా పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న దేశంలో 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేయని కులగణను దేశవ్యాప్తంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేయడానికి తీసుకున్న నిర్ణయం సంచలనమన్నారు. 1931లోనే బ్రిటిష్ ప్రభుత్వం కులగణన చేస్తే మళ్లీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణాలో కులగణను చేపట్టేందుకు ఆ పార్టీ నాయకులు ఒప్పుకోలేదన్నారు. ఆర్టికల్ 370, వక్ఫ్ బిల్లులు, త్రిబుల్ తలాక్ బిల్లులు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం దేశవ్యాప్తంగా కులగణన తమతోనే వచ్చిందని ప్రకటించుకోవడం శోచనీయమన్నారు. దేశంలో విప్లవాత్మక ధైర్యమైన నిర్ణయం తీసుకోవాలన్న బీజేపీ సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేని స్థితికి ప్రభుత్వం చేరిపోయిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యంను కొనుగోలు చేయకపోవడంతో రెండు నెలలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యంకు సైతం డబ్బులు ఇవ్వడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వ విప్‌తోపాటు జిల్లా కలెక్టర్‌లు స్పందించిన ధాన్యంను వేగంగా కొనుగోలు చేసి డబ్బులను రైతులకు చెల్లించాలచాలన్నారు. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, దుమాల శ్రీకాంత్, వంతడుపుల సుధాకర్, సిరిసిల్ల వంశీ, ఊరగొండ రాజు, చొప్పదండి శ్రీనివాస్,గుడ్ల విష్ణు, అంకారపు రాజు, వేముల సురేష్, ఇంజ్జపూరి మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

అన్ని వర్గాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. జయవరం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు శనివారం దాదాపు 50 మంది ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కులగణన జరిపి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. రైతులు పండించిన ధాన్యన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఎంతో వేగంగా ధాన్యం కొనుగులు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. నిన్నటి వరకు 75వేల 484మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అయినప్పటికీ ఇతర పార్టీల నాయకులు రోడ్డుపైకెక్కి నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, సంఘ స్వామి పలువురు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

కొనుగోలు కేంద్రం స్థలానికి హద్దులు నిర్ణయించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చందుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించిన స్థలానికి హద్దులు నిర్ణయించాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించిన స్థలానికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ రైతులు డిప్యూటీ తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ఏళ్లు గడిచిన స్థలం కేటాయింపులో జాప్యం పట్ల రైతులు ధాన్యం రోడ్లపై ఆరబెట్టడంతో ప్రమాదాలు చోటుచేసుకుని ఇద్దరు మృతిచెందిగా, పలువురు గాయపడ్డారన్నారు. ప్రభుత్వ పెద్దలు పలుమార్లు అధికారులకు విన్నవించిన సమస్యల పరిష్కారంలో దృష్టి సారించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని కనీసం 20 ఎకరాల్లో మార్కెట్ యార్డ్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. స్టేడియం నిర్మాణానికి 176 సర్వే నంబర్‌లో సుమారు 6 ఎకరాల 30 గుంటల స్థలం కేటాయించినట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తీర్మానం పంపించారు. స్టేడియం నిర్మాణానికి సంబంధించి హద్దుల కేటాయింపు విషయంలో జాప్యం పట్ల గ్రామస్తులు, క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణకు, మినీ స్టేడియం నిర్మాణ స్థల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజుల్లో రైతులు, క్రీడాకారులతో కలిసి ఆందోళనలు చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, కమలాకర్, తిరుపతి, రాజు, రవీందర్ రెడ్డి, నర్సయ్య, రైతు సంఘం నేతలు, రైతులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పసుల వెంకటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా ఉండాలన్నారు. ప్రభుత్వ అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వీరిలో మండల అధ్యక్షుడు మంద రాజు, నాయకులు కడగండ్ల తిరుపతి, బెజ్జంకి శ్రీనివాస్, మచ్చ ప్రభాకర్, బడుగు లింగం, రమేష్, పరశురాం, కిరణ్, లచ్చయ్య, బాలయ్య తదితరున్నారు

కలెక్టర్ ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బందులు పడుతున్న మూడు కుటుంబాలకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థిక సహాయాన్ని అందించి చేయూతనిచ్చారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మూడు కుటుంబాలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నామని ఆర్థిక సహాయం చేయాలని వినతిపత్రాలను అందించి వేడుకున్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ వారి కుటుంబాల స్థితిగతులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఆయా కుటుంబాల దీనస్థితులను చూసి చలించిపోయారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో తంగళ్లపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామానికి చెందిన దాసరి మల్లవ్వ, కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట కళావతి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన సింగం నర్సవ్వలకు రూ 25 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. తాము ప్రజావాణిలో ఆర్థిక సహాయం అందించాలని కోరడంతో స్పందించిన కలెక్టర్‌కు మూడు కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పక్కా ప్రణాళిక, లక్ష్యంతో ఉన్నతస్థానాలకు ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అభినందించారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు విష్ణుప్రియ 580, విగ్నారెడ్డి 573, వైష్ణవి 553, అలేఖ్య 551 మార్కులు సాధించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిహర్షిత్ 573, భానుతేజ 562, నవజీత్ 561, సుశృత 558, కావ్య 545, మైత్రి 531, భవ్య 535 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఐఐటీ లక్ష్యంగా కష్టపడి చదువుతూ తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా విద్యాలయాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడలోని క్యాంపు కార్యాలయంలో సిరిసిల్ల సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందించారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన కే ఐశ్వర్యం, బి తరుణి, బి లక్ష్మీ, సచిత్‌చరణ్, మయూక, డి లక్ష్మప్రసన్న, అక్షర చైతన్య, అక్షయతో పాటు 550 పైన మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోని ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగుల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

వేములవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలో ఈనెల ఏడవ తేదీ నుంచి వేసవి క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగమరావు, ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారు ఈ వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, మే 7వ తేదీ నుంచి జూన్ 6 వరకు క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ అందిస్తామని తెలిపారు. 13 సంవత్సరాల నుండి 23 సంవత్సరాలలోపు వయస్సు గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 9177259935 సెల్ నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

గంభీరావుపేటలో బంద్ విజయవంతం

గంభీరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం హిందూ ఐక్య వేదిక ఇచ్చిన బంద్ పిలుపు విజయవంతమైంది. పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక గంభీరావుపేట పట్టణ బంద్‌కు పిలుపు నిచ్చింది. ఉగ్రదాడిని నిరసిస్తూ పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనంచేశారు. పాకిస్తాన్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ దిష్టిబొమ్మను గ్రామంలోని మెయిన్ రోడ్ వెంట ఊరేగించి, ప్రధాన కూడలైన తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద దహనం చేశారు. మండల కేంద్రంలో అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు శనివారం సంపూర్ణంగా బంద్ పాటించాయి. బంద్ నేపథ్యంలో పట్టణం నిర్మానుష్యంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని వ్యాపార దుకాణాలు మూసి ఉంచాయి. ఈ బంద్‌లో హిందూ ఐక్య వేదిక నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

దేశీయ మూలికా వైద్యంపై అవగాహన సదస్సు

సిరిసిల్ల టౌన్ మే 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ అంబా భవాని ఫంక్షన్ హాల్‌లో దేశీయ మూలికల సంఘం ఆధ్వర్యంలో దేశీయ మూలికల వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిరిసిల్ల పట్టణ సీఐ కే కృష్ణ, ఫారెస్ట్ అధికారులు హరిప్రసాద్, ఆడేపు వేణు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అవగాహన సదస్సును నిర్వహించిన సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు జిందం కమలాకర్‌ను దేశీయ మూలిక వైద్య సంఘం అధ్యక్షుడు సింహాచల లక్ష్మణస్వామి, రవితేజ, లింగరాజు, మోహన్ సన్మానించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టుచేసినట్లు ఏసీపీ ఎం రమేష్ తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులసమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రశాంత్ నగర్‌కు చెందిన చీమల తిరుపతి, రాగుల రాజశేఖర్, బోనగిరి రాకేష్‌లకు నేర చరిత్ర ఉందన్నారు. 2021లో ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారి మొగిలి హత్య కేసులో వీరు నిందితులు. ఈకేసు ప్రస్తుతం ట్రయల్‌కు వచ్చిందన్నారు. రాకేష్, రాజశేఖర్‌లు కేసు రాజీ చేసుకుందామని ప్రధాన నిందితుడు చీమల తిరుపతితో సంప్రదిస్తే రాజీ అవసరం లేదని, కేసు కొట్టుడు పోతుందంటూ దాట వేశాడన్నారు. ఈ విషయంలో ముగ్గురి మధ్య విభేదాలు తలెత్తాయని, మూడు రోజులుగా మాట్లాడుదామని పిలిచినా తిరుపతి స్పందించలేదని, కేసులో శిక్ష పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయని ఇద్దరు నిందితులు తిరుపతికి నచ్చజెప్పినా అతను ఒప్పుకోలేదన్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి నిర్వహిస్తున్న ఎస్‌ఎం ఆన్‌లైన్‌సెంటర్‌కు వచ్చిన నిందితులు అతనిపై కత్తులతో దాడిచేశారని తెలిపారు. నిందితులిద్దరిని గోదావరి సమీపంలోని సమ్మక్కసారలమ్మ గద్దెలవద్ద అరెస్టుచేశామని, వారినుంచి బైక్,కత్తులు స్వాధీనపర్చుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ భూమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు సదానందం పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



రాజమ్మ(ఫైల్)

ఓదెల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజమ్మ(70) అనే వృద్ధురాలు పాము కాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఇంటిపనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు గాండ్ల సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కానరాని పర్యాటక శోభ

- అభివృద్ధికి నోచుకోని కొండగట్టు
- ప్రతిపాదన దశలోనే నిలిచిన రోప్‌వే
- కలగానే కోతుల పార్క్

మల్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన గుట్టలు.. వందలాది ఎకరాల భూములు.. పచ్చని చెట్లు.. మైమరిపించే అందాలు.. అన్నింటికీ మించి కోతుల కిచకిచలు... ఇవి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రత్యేకత. కానీ పర్యాటకంగా అభివృద్ధి మాత్రం ఇక్కడ కనిపించదు. కొండగట్టు పుణ్య క్షేత్రానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. కొండగట్టు ప్రాంతం పర్యాటకంగా అన్ని విధాల ఎంతో అనుకూలం అయినప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉండటం పట్ల ఈ ప్రాంతవాసులు



రోప్‌వే ప్రతిపాదిత స్థలం



కొండగట్టు అంజన్న ఆలయం

అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంపై అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి పరుస్తామని హామీలు ఇచ్చిన నేతల మాటలు నీటిమూటలు అవుతున్నాయి. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

కొండగట్టులో రోప్‌వే ఏర్పాటు పదేళ్లుగా ప్రతిపాదన దశలోనే మిగిలిపోయింది. మెట్లదారి నుంచి ప్రస్తుత పుష్కరిణి వెనుక వైపు వరకు తాడు మార్గం (రోప్ వే)కు అప్పట్లో రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. పర్యాటక శాఖ అధికారుల సైతం పలుమార్లు కొండగట్టును సందర్శించి రోప్‌వే కోసం పరిశీలన జరిపారు. రెవెన్యూ అధికారులు సుమారు 12 ఎకరాల మేర స్థలం కూడా కేటాయిం చారు. తదనంతరం దాని ఊసే లేకుండా పోయింది. రోప్ వే అ యితే ఇక్కడ పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా దానిని పట్టించుకునే వారే కరువయ్యారు.

అమలుకు నోచుకోని హామీలు

కొండపైన కోతుల పార్క్ ఏర్పాటు చేయడం వలన వాటి సంరక్షణ, పెంపు తదితర అవకాశాలు ఉండగా అది అమలుకు ఆమడ దూరంలో ఉంది. ఆంజనేయ స్వామి ప్రతిరూపంగా కొండగట్టు దేవస్థానానికి వచ్చే భక్తులను విశేషంగా ఆకర్షించే కోతుల సంరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటి ఉనికి ప్రశ్నార్థంగా మారుతోంది. ఆహార అన్వేషణలో కొండ దిగి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కోతులు తరచుగా భారీ వాహనాల కింద పడి మరణిస్తున్నాయి. కొండగట్టు దేవస్థానం పరిధిలో గల కనీసం 200 ఎకరాలు భూమి కోతుల పార్క్ కోసం అవసరముండగా ఇందుకు కావాల్సిన నివేదికను అటవీ శాఖతో పాటు జంతు ప్రదర్శన (పర్యావరణ) శాఖ అధికారులు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే సమన్వయ లోపం, దేవాదాయ శాఖ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోతుల పార్క్ కలగానే మిగులుతోంది.



నమూనా రోప్‌వే

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతిచెందిన వృద్ధుడు

కరీంనగర్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు(60) శుక్రవారంరాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తెలిపారు. కరీంనగర్ కమాన్‌వద్ద అనారోగ్యంతో రోడ్డుపక్కన పడిఉన్న వృద్ధుడిని గతనెల25న 108అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స అందిస్తుండగా వృద్ధుడు మృతిచెందినట్లు తెలిపారు.మృతుడిని గుర్తించినవారు రెండోఠాణా, అవుట్‌పోస్ట్‌పోలీసులను సంప్రదించాలని కోరారు. వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

పుస్తెల తాడు ఇవ్వనందుకు భార్య హత్య

- నిందితుడి అరెస్ట్ • వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కొడిమ్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చడానికి భార్య మెడలోని బంగారుపుస్తెల తాడు అడిగితే ఇవ్వలేదని కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మమతను ఆమె భర్త అవుదుర్తి మహేందర్ ఉరివేసి హత్య చేశాడని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు మమతతో 20 సంవత్సరాలక్రితం వివాహం జరిగిందన్నారు. వీరిద్దరికి సంతానం లేకపోవటం, కుటుంబంలో ఆర్థిక పరమైన విషయాల్లో గొడవలు జరుగుతున్నాయన్నారు. సంతానం లేకపోవటంతో మహేందర్ తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడన్నారు. నిందితుడు ఏ పని చేయక పోవటంతో మమత షాపింగ్‌మాల్‌లో పనిచేసేదన్నారు. భార్య ఉద్యోగం చేయగా వచ్చే డబ్బులను నిందితుడు తీసుకునేవాడని డీఎస్పీ వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం బంగారు పుస్తెల తాడు ఇవ్వాలని అడుగగా మమత నిరాకరించిందన్నారు. భార్యను చంపితే పుస్తెల తాడు తీసుకోవచ్చునని పథకం వేశాడని డీఎస్పీ తెలిపారు. గత నెల 26న వేములవాడ, నల్లగొండ దైవ దర్శనాలకు వెళ్దామని నమ్మించి దర్శనాల అనంతరం మమతను మహేందర్ కొడిమ్యాలలోని ఇంటికి తీసుకువచ్చాడన్నారు. అనంతరం భార్య మెడ చుట్టు నైలాన్ తాడుతో ఉరి పెట్టి హత్య చేశాడన్నారు. ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు నైలాన్ తాడును ఇంటి స్లాబ్ హుక్‌కు కట్టాడన్నారు. అనంతరం పుస్తెల తాడు తీసుకొని గోల్డ్ లోన్ పెట్టి అప్పులను తీర్చుకున్నాడని డీఎస్పీ తెలిపారు. శనివారం మోటారు సైకిల్‌పై పారిపోతుండగా మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. మృతురాలి తల్లి రాచకొండ పద్మ ఫిర్యాదు మేరకు మహేందర్‌పై హత్య కేసు, మహేందర్ కుటుంబ సభ్యులపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుని వద్ద మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కల్వచర్లలో మహిళ దారుణ హత్య



సమ్మక్క(ఫైల్)

రామగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కౌండిన్యనగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి మోటం సమ్మక్క(30) అనే మహిళ హత్యకు గురైంది. మంచిర్యాలజిల్లా తాండూరు ఐబీకాలనీ సమీపంలో పత్తి కనకరాజు అనే వ్యక్తితో సమ్మక్క కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. స్క్రాప్ వ్యాపారం చేస్తున్న వీరు తాండూరులో వ్యాపారం సజావుగా కొనసాగడం లేదని రెండు రోజులక్రితం కల్వచర్లలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. వ్యాపారంలో భాగంగా శుక్రవారం మంథని, కాటారం ప్రాంతంలో పర్యటించి రాత్రి కల్వచర్లకు చేరుకున్నారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆవేశంతో కనకరాజు అక్కడే ఉన్న సిమెంట్ బ్రిక్స్‌తో సమ్మక్క తలపై దాడి చేశాడు. ఈఘటనలో సమ్మక్క అక్కడిక్కడే మృతిచెందింది. అనంతరం కనకరాజు అక్కడినుంచి పరారయ్యాడు. కాగా మోటం సమ్మక్కకు గతంలో వివాహం జరగగా అనారోగ్య కారణంగా భర్త మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కనకరాజుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమ్మక్క తమ్ముడు తూర్పాటి మహేష్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిచెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన నాగవెల్లి బాలయ్య(70) అనే వృద్ధుడు శనివారం ఇంటి ఆవరణలోని మామిడిచెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అతని భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ కే రమేష్ పేర్కొన్నారు.

మరణంలో కూడా ఇద్దరికి చూపునిచ్చిన మహిళ



వినోద(ఫైల్)

సైదాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి మృతి చెందుతూ తన నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపునిచ్చింది. ఆ తల్లి మృతిచెందిన నేత్రాలు మాత్రం చూస్తూనే ఉంటాయి. సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన మద్దూరి వినోద (65) అనారోగ్యంతో మృతిచెందగా వారి కుమారుడు రాంచంద్రారెడ్డి, కూతుళ్లు, అల్లుళ్ల రమ-సంపత్ రెడ్డి, స్వప్న-పతీష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. దీంతో వరంగల్ ప్రాంతీయనేత్ర వైద్యశాలలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర టెక్నీషియన్ లక్ష్మన్ నేత్రాలను సేకరించారు. మృతురాలు నేత్రదానంద్వారా ఇద్దరు అందులకు చూపురావడమే కాకుండా నేత్ర వైద్యవిద్యకు ఉపయోగ పడిందని తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅసోసియేషన్ వరంగల్‌జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, హన్మకొండ జిల్లా ప్రధానకార్యదర్శి జనార్దన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా..
వాహనాలను సీజ్ చేసిన అధికారులు



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఎక్స్‌కావేటర్

గన్నేరువరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కెనాల్ మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తాంద్రనరేష్ తెలిపారు. మండలంలోని గునుకుల కొండాపూర్ శివారులోని మిడ్‌మానేరు వరదకెనాల్ మట్టిని గునుకుల కొండాపూర్‌కు చెందిన గూడెల్లి నరేష్, జనగామ అనిల్, బూట్ల సతీష్ అక్రమంగా తరలిస్తున్నారన్న స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఆ ప్రదేశానికి వెళ్లి ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇరిగేషన్ ఏఈ మహేందర్ ఫిర్యాదు మేరకు వాహనాలను సీజ్‌చేసి యజమానులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే స్థానికులు తమ దృష్టికి తీసుకరావాలని ఇరిగేషన్ ఏఈ మహేందర్ సూచించారు.

ఆదివాసుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ప్రభుత్వం బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలి • శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్

జమ్మికుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పని చేపట్టాలనుకున్నా వారి నిర్ణయానికి వ్యతిరేఖంగా చేసే అధికారం లేదని శాంతిచర్చల కమిటీచైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వాటిని స్వయంగా ప్రభుత్వమే ఉల్లంఘిస్తూ ఆదివాసుల హక్కులకు విఘాతం కలిగించటం ప్రజాస్వామ్యబద్ధం కాదన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో శాంతిచర్చలను కోరుతూ మానవ హక్కుల వేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. రాజ్యాంగం ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవించే హక్కును కల్పించిందన్నారు. ఇది ఆదివాసులకు, మావోయిస్టులకు, పోలీస్‌వారికి అందరికీ వర్తిస్తుందన్నారు. తాము శాంతి చర్చల కమిటీగా ఏర్పడి మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి హింసను వీడనాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. మావోయిస్టులు తుపాకులు వినియోగించమని, చర్చల ద్వారా శాంతి ఏర్పడటానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారన్నారు. నెలరోజుల నుంచి వారు దానికి కట్టుబడి ఉంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వారిని చుట్టుముట్టి చంపి వేయడానికి మరిన్ని బలగాలను పంపడం ఏ రకంగాను ధర్మం కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. చర్చల సమయంలో ఏ రకమైన షరతులైనా పెట్టవచ్చని, కానీ చర్చలకు ముందు షరతులు పెట్టడం భావ్యం కాదన్నారు. కర్రె గుట్టల్లో, ఛత్తీస్‌గఢ్‌లో మోహరించిన బలగాలను.. మావోయిస్టులను చంపటానికి పంపకూడదని అన్నారు. చర్చల ప్రక్రియను ప్రారంభించాలని, అందుకోసం ప్రజలు, ప్రాజాస్వామిక వాదులు తమ గొంతు విప్పాలన్నారు. అన్నిరాజకీయ పార్టీలు సైతం వాటి రాజకీయ వైఖరీకు అతీతంగా సమస్యను శాంతియుతంగా మానవీయ మార్గంలో పరిష్కరించడానికి తమవంతుగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో దేశిని కోటి, మొలుగూరి సదయ్య, పింగిలి రమేష్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, కనుమల్ల విజయ, మిలుకూరి వాసుదేవరెడ్డి, బదావత్ రాజు, టి హరికృష్ణ, పందిళ్ల రంజిత్‌కుమార్, గుంటి సామ్రాజ్యం, మోహన్, దొడ్డె సమ్మయ్య, ఆవాల నరహరి, పుల్లూరి సంపత్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

బాలుడి ప్రాణం మీదికి తెచ్చిన కోడిగుడ్డు

- ప్రాణాలు కాపాడిన 108టెక్నీషియన్



అస్వస్థతకు గురైన బాలుడితో తల్లిదండ్రులు

పాలకుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): యేడాది వయసు ఉన్న బాలుడు.. గొంతులో కోడి గుడ్డు ఇరుక్కుపోయి ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడికి 108సిబ్బంది చికిత్సఅందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లిజిల్లా పాలకుర్తిమండలం రాణాపూర్ గ్రామానికి చెందిన రాజేష్-అశ్విని దంపతుల కుమారుడు శ్రేయాన్స్(1) వంటగదిలోని పాత్రలో ఉన్న గుడ్డును నోట్లో వేసుకున్నాడు. అదికాస్త గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. దీంతో దిక్కుతోచని బాలుడి కుటుంబసభ్యులు హుటాహుటినపెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. శ్రేయాన్స్‌ను పరీక్షించిన వైద్యులు కరీంనగర్‌తీసుకెళ్లాలని సూచించారు. 108లో కరీంనగర్‌కు తరలిస్తుండగా బాలుడి పరిస్థితి విషమంగా మారింది. మార్గమధ్యలో 108టెక్నీషియన్ భానుప్రసాద్ బాలుడికి చౌకింగ్‌చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడాడు. బాలుడిని బ్యాక్‌స్లాప్స్‌తో ఫుడ్‌పార్టికల్స్(వాంపింగ్)ద్వారా గుడ్డును బయటికి రప్పించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు108టెక్నీషియన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలభవన్ శిక్షణ తరగతులకు స్పందన



సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బాల భవన్ వేసవి శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. అబాకస్, శాస్త్రీయ నృత్యం, యోగా, చెస్, మృదంగం, నృత్యం, సంగీతం, మెహందీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్ విభాగాలతో పాటు ఈ యేడు కర్రసాములోకూడా శిక్షణ ఇస్తున్నారు. జూన్ 10వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 3 వరకు నమోదై దరఖాస్తులు చేసుకున్న 617 మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. ఈ నెలలో వచ్చే బాల బాలికలు ఆధార్ కార్డ్, ఫోటోతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.



శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

నరసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం


స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళవాయిద్యాలు వెంట రాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి, నిత్య హోమం, నిత్య కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, ధర్మకర్తలు అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ఎస్ వెంకటరావు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన ఆయా ఆలయాలకు నెలకు నాలుగు వేల రూపాయలు ధూప దీప, నైవేద్యాలకు, అర్చక గౌరవ భృతి కింద ఆరువేల రూపాయలు చెల్లిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను పాత జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో మాత్రమే ఈ నెల 25వ తేదీ లోపు సమర్పించాలని, వివరాలకు, దరఖాస్తు ఫారం కోసం దేవాదాయశాఖ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న బోధన

- పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం
- బొమ్మలు, ఇతర సామగ్రితో పాఠాలు


అట్టముక్కలు, పేపర్లతో తయారు చేసిన ఇల్లు, చెట్లు, పరిసరాలు, బొమ్మలు

తిమ్మాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మొన్నటి దాకా అంగన్‌వాడీ కేంద్రాలంటే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడమే. కానీ ఇప్పు డు పిల్లలకు ఆటపాటలతోపాటు చదువు నేర్పే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రస్తుతం రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న బాలబాలికలకు అంగన్‌వాడీల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. వారికి అంకెలు, అక్షరాలు, ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారు.

● నూతన పాఠ్యాంశాలు

ప్రైవేట్ పాఠశాలల్లో విధంగా పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణంలో చిన్నారులకు విద్యతోపాటు పోషకాహారం అందించేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతోంది. దీనికోసం ప్రభుత్వం పూర్వ ప్రాథమికవిద్య బలోపేతమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఆటపాటలతో కూడిన బోధనను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆంగ్లమాధ్యంలో కొత్త అంశాలు, పాఠ్యాంశాలతో ప్రియదర్శిని పుస్తకాన్ని ప్రవేశపెట్టారు. ఆటపాటలు, బొమ్మలు, ఇతర సామగ్రి ద్వారా పిల్లలో అభ్యాసంపై ఆసక్తి పెరిగే విధంగా కృషి చేస్తున్నారు. దీంతో పిల్లలకు విద్యపై ఆసక్తిని పెరగడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛందంగా వస్తారు.

● అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ..

ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ విద్యలో శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా వారు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించే వీలుంటుంది. శిక్షణ ద్వారా అంగన్‌వాడీలకు నూతన విద్యా ప్రమాణాలపై పట్టువస్తుంది. ఎందుకంటే ఉపాధ్యాయుల్లో చాలామంది పది, ఇంటర్మీడియట్ చదివిన వారే ఉండడం, వారికి ఆంగ్ల బాష మీద పట్టు లేకపోవడంతో శిక్షణ వారిక ఎంతో ఉపయోగపడుతుంది.

● ఆటపాటలతో..

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకో అంశాన్ని తీసుకొని విద్యార్థులకు బోధిస్తున్నారు. అదికూడా పనికి రాని వస్తువులు తీసుకొని వాటితో పలురకాలుగా విద్యార్థులకు నిత్యజీవితంలో ఉపయోగపడి, చూసే వాటిని తయారు చేయడం వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. పూల నుంచి వెలువడే సువాసనలు, పూల రంగులు, వాటి ఆకారం గురించి పిల్లలకు చూపిస్తు బోధిస్తున్నారు.సొంతంగా పలు రకాల పండ్లను అట్టలతో తయారు చేయడం వల్ల వారిలో పండ్ల రకాలు, వాటిలో లభించే షోషక విలువలు, వాటి రంగులు, వాటి ఆకారాలు తెలియజేస్తున్నారు. మట్టితో కూరగాయలు, పండ్లు తయారు చేయించడం వాటికి రంగుల వేయించడం చేస్తున్నారు. పాలడబ్బాలతో, పేపర్‌తో క్యాలెండర్, గడియారం తయారు చేయించడం వాటిని చూపించి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలను ఇసుకతో, చింత గింజలతో పేర్చడం ద్వారా అక్షరాలను చూపెడుతూ నేర్పిస్తున్నారు.పిల్లలకు వాహనాల గురించి తెలిపేందుకు ఏ వాహనం ఎలా ఉంటుందో, ఆ వాహనాం ఎలా నడుస్తుందో మట్టితో తయారు చేయిస్తూ పిల్లలకు తెలుపుతున్నారు. చిన్ననాటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు ప్లాస్టిక్ టీకప్పులతో ట్రాఫిక్‌లైట్లను, సిగ్నల్స్‌ను తయారు చేసి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. అట్ట ముక్కలు, పేపర్స్, దూది, మట్టి, గడ్డి, గాజు తదితర వస్తువులతో వివిధ శరీరభాగాలను తయారుచేసి పిల్లలకు అవయవాల గురించి తెలియజేస్తున్నారు. కుటుంబం అంటే ఏంటి అందులో ఉండే వ్యక్తులు అమ్మ, నాన్న, ఇల్లు, రక్త సంబంధీకులు గురించి అవగాహన కల్పిస్తున్నారు. జంతువుల బొమ్మలు తయారు చేసి వాటిపై అవగహన కల్పిస్తున్నారు.

సొంతంగా తయారు చేసిన ఉపకరణాలతో బోధిస్తున్నాం..



- శ్రీమతి, సీడీపీవో, కరీంనగర్ రూరల్..

గతానికి భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యబోధన జరుగుతోంది. పిల్లల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలనే ఆసక్తి పెరిగింది. ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆడుతూ, పాడుతూ విద్యబుద్ధులు నేర్చుకుంటున్నారు. చిన్ననాటి నుంచే సమాజంపై పిల్లలకు ఒక అంచనా ఏర్పడుతోంది. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలతో వస్తువులను తయారు చేయించడం వాటిపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. నెలకో కొత్త అంశాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు.



▼▲ వివిధ రకాల బొమ్మలు


మన ఊరు తెలియజేసే విధంగా మట్టి, వివిధ వస్తువులతో తయారు చేసిన అంశం

రాష్ట్రస్థాయి అన్నమయ్య కీర్తనల పోటీలు

-విజేతలకు బహుమతులు అందజేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


విజేతలతలో ముఖ్య అతిథి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, స్వరమాధురి సంస్థలు సంయుక్తంగా కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ కోదండరామాలయంలో శనివారం రాష్ట్రస్థాయిలో అన్నమాచార్య కీర్తనల పోటీలు నిర్వహించారు. విజేతల బహుమతి ప్రదానోత్సవానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలు జరిపిన నిర్వాహకులకు, పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 10 జిల్లాల నుంచి 200 మంది పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. స్వరమాధురి సంస్థ అధ్యక్షుడు కేబీ శర్మ, సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అన్నమయ్య జీవితం, సంకీర్తనల సారం అంశాలపై మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద సబ్‌జూనియర్స్ విభాగంలో నిధిచంద్రిక, భవిష, అనిరుధ్, జూనియర్స్ విభాగంలో అభిరాం, సింధుశ్రీ, సీనియర్స్ విభాగంలో భాస్వంత్‌శర్మ, సుష్మిత, జ్యోతి, సూపర్ సీనియర్ విభాగంలో సుదర్శన్, శంకర్, సుధాకర్ బహుమతులు అందుకున్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

జగిత్యాల అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన దండుగుల నవీన్ అనే నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..

దండుగుల నవీన్ అనే యువకుడు జగిత్యాల పట్టణంలోని జమ్మి గద్దె ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా లక్ష్మీ ట్రావెల్స్‌ను ఏర్పాటు చేశా డు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో జగిత్యాల పట్టణ ఎస్ఐ గీత ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మి ట్రావెల్స్‌కు వెళ్లి తనిఖీ చేశారు. నవీన్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా ఒక గది అద్దెకు తీసుకుని అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసగిస్తున్నాడని విచారణలో తేలింది. దీంతో సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

అంతర్జాతీయంగా పాక్ ఒంటరి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సమావేశంలో పాల్గొన్న ప్రజలు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా పాక్ ఒంటరిగా మిగిలిందని, భారత్ స్నేహహస్తం అందిస్తుంటే పాక్ మాత్రం దుర్బుద్ధితో దాడిచేయడం గర్హనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ బృందావన్ గార్డెన్‌లో 'పహల్గాం ఘటనా అనంతరం భారత్ వ్యూహాత్మక అడుగులు-పరిణామాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. కాశ్మీర్ భారత్‌లో ఎప్పటికీ అంతర్భాగమేనని అన్నారు. దేశానికి ఒకే రాజ్యాంగం, చట్టం ఉంటుందని దాన్ని ఎవరూ చెరిపేయలేరని అన్నారు. సుప్రీంకోర్టు కూడా ఆర్టికల్ 370 రద్దును సమర్థించిందని గుర్తుచేశారు. కాశ్మీరులో జరుగుతున్న అభివృద్ధి ని చూసి పీవోకేలోని యువత తాము భారత్ వాసులమేనని ఉద్యమాలు చేయడం, ఇటీవల పాక్‌కు అమెరికాకు సంబంధాలు చెడిపోవడం, పాక్ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవడంతో అక్కసును భారతదేశంపై చూపించడం జరిగిందని అన్నారు.

గల్ఫ్ దేశాలు కూడా భారత్‌తో సత్సంబంధాలు నెరపడం కొందరికి మింగుడు పడటం లేదని తెలిపారు. నేడు అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అయిందని అన్నారు. తాలిబన్లు, ఇరానియన్లు, ప్రపంచమంతా భారత్ వైపే ఉండటం, పాక్‌లో ఆహార కొరత, అక్కడి ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత రావడంతో వీటన్నిటిని డైవర్ట్ చేసేందుకు మతం ఆధారంగా ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నారని అన్నారు. ప్రధాని మోదీ విమానాశ్రయంలోనే వివిధ సైన్యాధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి ఒక ధైర్యాన్ని నింపడం గొప్ప విషయమని అన్నారు. పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడం యుద్ధ నీతిలో ఒక భాగమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గాజుల రవీందర్, డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, డి నిరంజనాచారి, బీఎస్ శర్మ, సముద్రాల నాగేశ్వరరావు, మందల నగేశ్‌రెడ్డి, జె సత్యనారాయణరెడ్డి, దేశిని శ్రీనివాస్, వెచ్చ మురళి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, ఎలగందుల సత్యనారాయణ, నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవ్వు ఓ వరం..

- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : నవ్వడం ఒక యోగం... నవ్వించడం ఒక భోగం... నవ్వకపోవడం ఒక రోగం... అంటారు పెద్దలు. ఎంతటి శత్రువునైనా నవ్వుతో పలకరిస్తే జయించవచ్చు. నవ్వు వ్యక్తి ముఖ కవళికలు, భావోద్వేగాలపై ప్రభావం చూపుతాయి. వరంలాంటి నవ్వు నిండు ముఖానికి ఎంతో అందం, ఆనందం, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.నేటి యాంత్రిక జీవితంలో నిత్యం ఎంతో కొంతసేపు నవ్వితేగాని ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం, ప్రేమ, అభిమానాలు అందవు. ఈ దిశలో నవ్వు ప్రాధాన్యాన్ని తెలిపే ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ప్రతీయేటా మే నెల మొదటి ఆదివారం జరుపుకుంటారు.



● నేపథ్యం...

ఈ దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం జరుపుకునే వారు. చాలా దేశాల్లో జనవరిలో చలి వాతావరణం ఎక్కువగా ఉండడంతో ఈ తేదీని మార్చాలని నవ్వుల ప్రియులు కోరారు. లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నిర్వహించాలని నిర్ణయించారు. స్టీవ్ విల్సన్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త మొదట తన వృత్తిలో భాగంగా హాస్యానికి మానవుల మానసిక ప్రవృత్తికిగల సంబంధాల మీద పరిశోధనలు చేస్తూ వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. 1997లో ఇండస్ ఫౌండేషన్ అనే భారతీయ సంస్థ టూ క్రియేట్ ఏ పాజిటివ్ వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశం మీద ప్రసంగించడానికి భారత్‌కు ఆహ్వానించింది. అప్పటికే ముంబాయిలో జూహూ బీచ్ లాఫ్టర్స్ క్లబ్ డాక్టర్ మదన్ కతారియా నెలకొల్పాడు. ఈ క్లబ్‌ను హాస్య యోగా అని పిలిచారు. 1998 జులైలో విల్సన్‌తో కలిసి వరల్డ్ లాఫ్టర్ టూర్‌ను నిర్వహించారు. దీంతో నవ్వుల దినోత్సవానికి అంతర్జాతీయ ప్రచారం లభించింది. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగేన్ 2000 జనవరి తొమ్మిదిన నిర్వహించారు. ఈ ఉత్సవం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదైంది. దీంతో మొదట జనవరిలో నిర్వహించిన నవ్వుల దినోత్సవం 2004 నుంచి మే మొదటి ఆదివారానికి మార్చారు. నవ్వుల యోగా ఉద్యమం ప్రస్తుతం 115 కంటే ఎక్కువ దేశాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా దేశాల్లో వేలాది లాఫింగ్ క్లబ్‌లను నిర్వహిస్తున్నారు.

● నవ్వుతో ప్రయోజనాలు

నవ్వు మన శరీరంలో సానుకూల రసాయనాలను విడుదల చేస్తుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. సంతోషంగా ఉండేందుకు సహకరిస్తుంది. ప్రపంచ శాంతి పెంపొందించేందుకు తోడ్పడుతుంది. గాఢమైన నవ్వు లోతైన శ్వాసను ఉత్తేజపరచి ఆక్సీజన్ ప్రవాహం పెంచుతుంది. కండరాలను సడలించడానికి కారణమౌతుంది. రోగ నిరోధక శక్తి పెంచుతుంది. నిరాశా భావాల్ని ఎదుర్కోవడంలో సహకరిస్తుంది. విభిన్న సంస్కృతులు, నేపథ్యాల ప్రజలను ఏకం చేస్తుంది.

● జరుపుకునే విధానం...

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సమావేశమై నవ్వుతూ యోగాభ్యాసం చేస్తారు. కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు, సహచరులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, ఎవరైనా వ్యక్తులు పరస్పరం కలుసుకున్నపుడు నవ్వుతూ మాట్లాడుకోవడం కూడా ఓ పద్ధతి. అందుకే నవ్వుల యోగా సెషన్‌లు, కామెడీ షోలు, నవ్వుల ఫ్లాష్ మాబ్స్, నవ్వుల నేపథ్య పార్టీలు, నవ్వుల పవాళ్ళు, నవ్వుల వర్క్‌షాప్‌లు జరుపుకుంటారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

గణేశ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా పట్టించుకోవడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై రేవంత్‌రెడ్డి మాటలు ఉత్తవే అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్నామని ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబోమని ప్రైవేటు కళాశాలలు ప్రకటించాయన్నారు. ఇప్పటికే యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరీక్షలు సరైన సమయంలో జరగకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు బకాయిలు విడుదల చేసి పరీక్షల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, వినయ్, శ్రవణ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు తెల్లవారుజామున ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం సంకల్పపూజతో పాటుగా శివకల్యాణ పూజ పరివార దేవతాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు, ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంజన్న ఆలయంలో కోలాహలం..

మల్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి స్వామి వారి భక్తులు హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఇనుకొండ చంద్రరెడ్డి కుటుంబసభ్యులు లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ మేరకు అన్నదాన నిర్వహకులు రాజేందర్‌రెడ్డి, రవిందర్‌కు విరాళం సొమ్ములు అందించగా వారు రశీదు అందించారు.


కొండగట్టులో నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

నిత్యావసర సరుకులు, ఫర్నీచర్ అందజేత



నిత్యావసర సరుకులు, కుర్చీలు అందజేస్తున్న శంకర్ తదితరులు

ఎల్లారెడ్డిపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని మహిళ సంఘంలోని నిరుపేద మహిళలకు గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్, తాజా, మాజీ సర్పంచ్ ముక్క శంకర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, ఫర్నీచర్‌ను శనివారం అందజేశారు. మహిళలకు చేయూతను అందించేందుకు గామ ఫౌండేషన్ సంస్థ ముందుకు రావడం అభినందనీయని అన్నారు. మహిళా సంఘానికి తాజా, మాజీ సర్పంచ్ శంకర్ తన స్వంత ఖర్చులతో 25 కుర్చీలు, టేబుల్‌ను అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, పాల్, సురేశ్, సాగర్, రమ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన ఎల్లవ్వ కుటుంబానికి మంజూరైన బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కును స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం అందజేశారు. కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు బాలమల్లు, సుభాష్, నర్సింహారెడ్డి, తిరుపతి, మధు, రఘునందన్‌రావు, కార్తీక్, వంశీ, రవి, ప్రశాంత్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి కూలర్ వితరణ

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి కూలర్‌ను వితరణ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పల్లె దవాఖానా కొనసాగుతుండటంతో సిబ్బంది వేసవిలో ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న తిరుపతిరెడ్డి శనివారం కూలర్‌ను అందించారు. తాగునీటి కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడవద్దని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జీవనజ్యోతి, వైద్యసిబ్బంది శాంత, వెంకటరమణ, జవహర్, గిరిధర్, సుజాత, శారద, సేవా ప్రతినిధులు బొల్లారం ప్రసన్నకుమార్, గజ్జల శ్రీనివాస్, బొంగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచ్‌కు పరామర్శ

ఇల్లంతకుంట, మే 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామోజీపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ బెజ్జంకి శ్రీనివాస్‌ను జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు శనివారం పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి రాజయ్య అనారోగ్యంతో ఇటీవలే మృతిచెందాడు. కుటుంబీకులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు కేశవేని శ్రీనివాస్, మేరుగు రాజు తదితరులు ఉన్నారు.

రేపు 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు'

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్తూరులో ఈనెల 5న రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం ఉంటుందని ఏరువాక కేంద్రం కోఆర్డీనేటర్ మదన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రైతువేదికలో జరిగే అవగాహన కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. సమావేశంలో యూరియా వాడకం తగ్గించడం, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటం, సాగునీటిని ఎలా ఆదాచేయాలి తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరుగనున్నందున అన్ని గ్రామాల రైతులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమిపూజ

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దలింగాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో లైబ్రరీరూం, గాలిపెల్లి గ్రామంలో సీసీ రోడ్డుకు భూమిపూజ తదితర కార్యక్రమాలు ఉన్నందున అన్ని గ్రామాల నాయకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో ప్రతిగ్రూపులో 40సీట్లు ఉంటాయని, ఈనెల 5నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'చలో హైదరాబాద్' కర పత్రాల ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): చాకలి ఎస్సీ సాధన సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన 'చలో హైదరాబాద్' మహాసభకు సంబంధించిన కరపత్రాలను రజక సఘం నాయకులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. సభకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలమల్లు, పర్శరాములు, దేవయ్య, నర్సయ్య, చంద్రయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో జాప్యం వద్దు..

ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ, తరలింపులో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ధాన్యం సేకరణ, తరలింపుకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కల్గకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, బాబు, శ్రీనివాస్, బుచ్చాగౌడ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం నర్సక్కపేట గ్రామానికి ఎందుకు ధాన్యం కొనుగోలు కేంద్రం కేటాయించలేదని ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటూ నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల లైసెన్స్‌ల తనిఖీ



పత్రాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ

బోయినపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ల లైసెన్సులను ఎంవీఐ వంశీధర్ బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద శనివారం రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్‌కి సంబంధించిన అన్ని బస్సు డిపోల వాహనాలను నిలిపి డ్రైవర్ లైసెన్స్‌తో పాటు కండక్టర్‌కు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. కండక్టర్ లైసెన్స్ లేని ఇద్దరు ఆర్టీసీ బస్సు కండక్టర్లపై కేసు నమోదు చేశారు. పత్రాలు లేని మూడు సరుకు రవాణా వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు ఈ తనిఖీల్లో సిబ్బంది కానిస్టేబుళ్లు సౌమ్య, ప్రశాంత్, హోంగార్డు ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం సంబంధిత వైద్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల వైద్యులు, సిబ్బంది గౌరవంగా ఉండాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి సీఎం సహాయ నిధి ద్వారా, ఎల్‌వోసీల ద్వారా ఇప్పటివరకు రూ.20కోట్ల పైచిలకు మంజూరు చేశామన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి ఎంట్రెన్స్‌లో రోగులకు ఒక చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీ కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి కూర్చునేందకు వీలుగా సరిపడ కుర్చీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేసవి కాలం సందర్భంగా మంచినీటి వసతి, ఫ్యాన్లు అమర్చాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో సరిపడ వైద్య సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వంతో మాట్లాడుతానని పేర్కొన్నారు. మోకాళ్ల సర్జరీలు ఆసుపత్రిలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల వైద్యలను అభినందించారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య వైద్యులు తదితరులు ఉన్నారు.

అర్చకులకు అండగా ఉంటా..

ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యల సాధనకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రికి వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు తమ సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అర్చకులకు అండగా ఉంటానని, అర్చకుల సమస్యల సాధనలో తన వంతు సహకారం అందిస్తానని హామిచ్చారు. ప్రభుత్వ విప్‌ను కలిసిన వారిలో బిట్కూరి గోపాలకృష్ణ, గంగళ్ల ఉమాశంకర్, చర్లపల్లి సీతరాములు, లక్ష్మీకాంతం, దాశరధి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలుగా మార్చుతున్నారు : బీఆర్ఎస్

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పాల్గొంటున్న అధికారిక కార్యక్రమాలను సైతం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలుగా మార్చుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనంతారం గ్రామంలో ఎమ్మెల్యే ఆన్‌వీల్స్ కార్యక్రమంలో సభావేదికపై కాంగ్రెస్ నాయకులను కూర్చోబెట్టడం సరైన విధానం కాదన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలలోను ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం వల్లనే ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అని కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకుందన్నారు. రైతులు వరినార్లు పోసే కాలం ప్రారంభం కాబోతున్నా ఇంతవరకు పెట్టుబడి సాయం అందలేదన్నారు. కొనుగోలు కేంద్రాలలో అమ్మిన ధాన్యం డబ్బులు కూడా రైతుల ఖాతాలో పడలేదన్నారు. పెట్టుబడికి అప్పులు చేసే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సమావేశంలో సాదుల్, కూనబోయిన రఘు, దమ్మని మధు తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ



హమీద్‌ను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గంభీరావుపేట మే 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం రాత్రి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌ను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. గంభీరావుపేటలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో హమీద్ సోదరుడు సాజిత్ మృతిచెందాడు. ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి సాజిత్ దినకర్మను ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విచ్చేసి హమీదును పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు గౌడ్, నాయకులు సంగీతం శ్రీనివాస్, పర్ష హనుమాండ్లు, మేరుగు నాగభూషణం, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరీ శంకర్, మండల కేంద్రంతో పాటు గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు

● ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విచారం వ్యక్తంచేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు యువకులు అవేజ్, అఫ్రోచ్ కుటుంబాలను శనివారం రాత్రి ఆయన పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెట్టెత్తు బిడ్డలను కోల్పోవడం తీరని విషాదమని అన్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, నర్సయ్య, రాంరెడ్డి, బాబు తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య



విఠల్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన బత్తుల విఠల్(54) అనే మరమగ్గాల కార్మికుడు శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. విఠల్ పవర్‌లూమ్స్ రిపేరర్(జాఫర్)గా పనిచేస్తూ ఉపాధి పొందుతుండేవాడు. కొంత కాలంగా సరైన ఉపాధి లేకపోవడంతో దాదాపు రూ.3లక్షల అప్పులు అయ్యాయి. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఏర్పడ్డాయి. అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతో విఠల్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టాడు. మృతుడికి భార్య శారద, కొడుకు అనిల్, కూతురు బార్గవిలు ఉన్నారు. శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

రుద్రంగి, మే 3(ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండలం దేగవాత్‌తండాలో శ్రీ సీతా రామచంద్రస్వామి, ఏకశిల ధ్వజస్తంభ, నవగ్రహల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా అయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, జక్కు మోహన్, జక్కు వంశితదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆదికి ఆహ్వాన పత్రిక అందజేత

కోనరావుపేట : శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు శనివారం అందజేశారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామ వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవానికి రావాలని మాజీ సర్పంచ్ వంశీరావు, గ్రామస్తులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

అయిదు పోలీస్‌స్టేషన్‌లకు ట్రైనీ ఎస్‌హెచ్‌వోల నియామకం

సిరిసిల్ల క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు పోలీస్‌స్టేషన్‌లకు ట్రైనీ ఎస్‌హెచ్‌వోలను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎల్లారెడ్డిపేటకు వి. లక్ష్మణ్, తంగళ్లపల్లికి వినీతారెడ్డి, బోయిన్‌పల్లికి అనిల్ కుమార్, ముస్తాబాద్‌కు శ్రీనివాస్, కోనరావుపేటకు రాహుల్‌రెడ్డిలను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీచేశారు.

స్పెషల్ బ్రాంచిలోని హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీలు

జిల్లా స్పెషల్ బ్రాంచి పరిధిలోనూ ఆయా సర్కిళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వేములవాడ, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో స్పెషల్ బ్రాంచి హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ మార్పులు చేశారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ



వేములవాడలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



నారాయణపూర్‌లో గేట్ వాల్వ్ చుట్టూ పేరుకున్న నాచు

వేములవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ బ్రిడ్జి సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకై నీరంతా వృధాగా పోతోంది. చాలారోజులుగా ఇక్కడి పైప్‌లైన్‌కు లీక్ ఏర్పడి నీరంతా వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా మురికి నీరు పైపుల్లో చేరడంతో గృహ అవసరాల కోసం మిషన్ భగీరథ నీటిని వాడుకోలేని పరిస్థితి తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని మిషన్ భగీరథ నీటి పైపులైన్ వాల్వ్‌ల చుట్టూ నాచు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. లీకేజీల వల్ల తాగునీరు వృథాగా పోతోంది. శుభ్రం చేసి లీకేజీని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. వేసవి కావడం వల్ల దాహంతో ఆప్రాంత జనం అలమటిస్తోంది. గేట్‌వాల్వ్‌ల నుంచి వృథాగాపోతున్న నీటితోనే దాహం తీర్చుకుంటోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గేట్ వాల్వ్‌ల చుట్టూ ఉన్న అపరిశుభ్రత తొలగించి లీకేజీని అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

గంభీరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లిలోని ఫ్రెండ్స్‌క్లబ్‌లో జూన్ 12న జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మే20న జరిగే సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాజు, రవి, బాలరాజు, శంకర్, ఆనంద్, బాలరాజు, మల్లయ్య, బాలరాజు, కనకయ్య, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

బోయినపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడగొండలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా 3వ రోజున స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, వలంటీర్లు పారిశుధ్య పనుల్లో పాల్గొని గ్రామ పరిసరాలను శుభ్రపరిచి, గ్రామస్తులకు స్వచ్ఛతా ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ అరుణ్ బాబు, సహాయక అధ్యాపకులు డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపేలా నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్థుల ముందు విద్యార్థులు వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రాధాన్యతపై నాటకం ప్రదర్శించారు.

మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ నీటి విడుదల

కోనరావుపేట మే 3 (ఆంధ్రజ్యోతి) : మల్కపేట రిజర్వాయర్ నుండి కుడికాలువ ద్వారా ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా మండలం మల్కపేట్ రిజర్వాయర్ కుడి కాలువ నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కుడి కాలువ పరిధిలోని 12 గ్రామాలకు 25654 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు. కోనసరావుపేట మండలంలోని మల్కపేట, కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల, రామన్నపేట, వేములవాడ మండలంలోని మారుపాక, గ్రామాలకు కాలువ ద్వారా నీటి ఎద్దడి తలగనున్నట్లు తెలిపారు.

దంచి కొడుతున్న ఎండలు..

(1వ పేజీ తరువాయి)

జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41.1డిగ్రీల నుంచి 43.8 డిగ్రీల వరకు వివిధ వెదర్ స్టేషన్‌లలో నమోదైంది. వైద్యులు ప్రజలు బయటకు వెళ్లే ముందు జాగ్రతలు పాటించాలని సూచిస్తున్నారు. తెలుపు రంగు పలుచటి వస్త్రాలు ధరించాలని, తలపై టోపీ, లేదా రుమాలు చుట్టుకోవాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ వంటివి తాగాలని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే చల్లటి ప్రాంతానికి తీసుకవెళ్లాలని తడిగుడ్డతో శరీరం అంతా తుడుస్తూ ఉండాలని, వైద్య సేవలందించాలని సూచిస్తున్నారు. ఎండనుంచి ఇంటికి రాగానే నిమ్మరసం, కొబ్బరినీళ్ల, నీళ్ల తాగాలని సూచిస్తున్నారు. చర్మం పొడిబారకుండా చూసుకోవాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా, శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలని, మాయిశ్చరైజింగ్ క్రీములు వాడాలని సూచిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. అకాల వర్షాల వల్ల భూమి నుంచి వేడి వస్తుంది. ఎండ తీవ్రత కూడా అధికంగా ఉంటుంది. ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య సంరక్షణ చర్యలు పాటించాలి. ఎండ అధికంగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితి అయితే తప్ప బయటకు రాకూడదు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడదెబ్బ ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం శ్రేయస్కరం కాదు. వడదెబ్బ నుంచి ఉపశమనం కోసం తరచూగా ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి. అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందాలి. అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయాలి.

'భూ భారతి' పైలట్ ప్రాజెక్టుగా రుద్రంగి ఎంపిక

రుద్రంగి మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూభారతి పోర్టల్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రుద్రంగి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మే 5 నుంచి 15వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌రావు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకొని ధ్రువపత్రాలను మోడల్ స్కూల్‌లో అందజేయాలని కోరారు. అర్హతగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

ఇల్లంతకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శ్రీకృష్ణ గోశాలకు వల్లంపట్ల మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయవెంకటనర్సింహారెడ్డి ఆదివారం పశుగ్రాసాన్ని వితరణ చేశారు. గోశాలకు కమిటీ సభ్యులు కోరిన మేరకు మాజీ సర్పంచ్ స్పందించారు. దీనితో కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

గంభీరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ గంధ్యడాపు రాజేందర్ తండ్రి గాలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. గంభీరావుపేటలోని బీఆర్ఎస్ సోషల్ మీడియా వారి యర్ రాజేందర్ ఇంటికి వెళ్లి తనను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణ అధ్యక్షులు వెంకట్ యాదవ్, సీనియర్ నాయకులు రాజారామ్, రాజు, మాజీ ఎంపీటీసీలు కమలాకర్‌రెడ్డి, స్వామి, బిక్షపతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్' అడ్మిషన్లు ప్రారంభం

గంభీరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ అడ్మిషన్లు ప్రారంభమైనవి అని కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పాసైన, గంభీరావుపేట, ముస్తాబాద్, మాచారెడ్డి మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన విద్యార్థులు దోస్త్ ద్వారా డిగ్రీలో అడ్మిషన్ పొందాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. దోస్త్ అడ్మిషన్ల కోసం డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని బస్టాండు ప్రాంతంలో రోడ్డు దాటుతున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు రమావత్ బాలియాను శనివారం బొలెరో వాహనం అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు బాలియా తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిమ్మాపూర్‌లోని వృద్ధుడు బాలియా పింఛను డబ్బుల కోసం రాచర్లగొల్లపల్లికి వచ్చాడు. కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి దాటుతున్న క్రమంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పులి సాగర్‌పై కేసు నమోదు చేశామని ప్రొబెషనరీ ఎస్ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన నీరంక శేఖర్ గత నెల 29న తన స్కూటీపై సిరిసిల్ల వైపుకు వెళుతున్నాడని పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామ శివారులో అటువైపు నుంచి వస్తున్న సాగర్ తన కారుతో స్కూటీని ఢీకొట్టాడని చెప్పారు. ప్రమాదంలో శేఖర్ తీవ్రగాయాల పాలయ్యాడని పేర్కొన్నారు. బాధితుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సాగర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ప్రొబెషనరి ఎస్సై లక్ష్మణ్ వివరించారు.

గర్జనపల్లిలో ముందస్తు బడిబాట

వీర్నపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి మండువేసవిలో సైతం ఉపాధ్యాయులు బడిబాట పడుతున్నారు. శనివారం గర్జనపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తీరును తల్లిదండ్రులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కులేరి ప్రేమ్ సాగర్, తిరుపతి జాదవ్, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేష్‌గౌడ్, జవహర్‌లాల్ తండా మాజీ సర్పంచ్ శ్రీనివాస్, భాస్కర్, గజన్ తదితరులు పాల్గొన్నారు.